క్లుప్తంగా

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



రాయవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

రాయవరం: రామచంద్రపురం, కొత్తపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు రామచంద్రపురం ఇన్‌చార్జి ఆర్డీవో ముక్కంటి తెలిపారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై ఆర్డీవో ముక్కంటి సంతృప్తి వ్యక్తం చేశారు.

చలివేంద్రం ప్రారంభం



సోమేశ్వరంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఆరిఫ్

రాయవరం: సోమేశ్వరంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యశ్రీకార్ అండ్ బైక్ వాష్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఆరిఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆరిఫ్ మాట్లాడుతూ సామాజిక సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా బుజ్జి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: కేదారిలంక సచివాలయంలో శనివారం విజయవాడకు చెందిన డాక్టర్ వైవీ రావు ఉషా కార్డియాక్ సెంటర్ సౌజన్యంతో 100 మందికి గుండె సంబంధిత పరీక్షలను చేశారు. సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు శిబిరాన్ని సందర్శించారు. కార్డియాక్ సెంటర్ నిపుణులు గ్రామంలోని ఒక్కొక్కరికి రూ.1200 విలువైన పరీక్షలను ఉచితంగా చేశారు. వారిని ప్రజాప్రతినిధులు అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

మండపేట: పేదల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. నియోజవర్గ స్వసక్తికరన్ బూత్ అభియాన్ సమావేశం శనివారం స్థానిక నాయుళ్ల కమ్యూనిటీ హాలులో పట్టణ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలుసుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. పార్టీ నాయకులు కోన సత్యనారాయణ, చాట్రాతి రాంబాబు, కేవీవీ సాయిరాం, గొడవర్తి రామచంద్రరావుచౌదరి, నరాల రాంబాబు, బండారు సూరిబాబు, రాయి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి మాతృవియోగం

కపిలేశ్వరపురం: వాకతిప్ప ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కుంచె కాంతమ్మ శనివారం మృతి చెందారు. ఆమె వీడీఓగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించి రిటైర్ అయ్యారు. ఆమె మృతికి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మాదే ప్రసాదరావు సంతాపం వ్యక్తం చేశారు.

నల్లచెరువులో ధన్వంతరి హోమం

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామికి షష్టమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ధన్వంతరి విశేషార్చన, హోమం వంటి విశేష పూజలు జరిపారు. శాంతి హోమం, బలిహరణ, హనుమంత వాహన సేవ వంటి పూజలు జరిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

రైతుకు ప్రాధాన్యం

- ధాన్యం కొనుగోలుకు ఆర్‌బీకేల్లో సర్వం సిద్ధం
- క్లస్టర్ పరిధిలో 3.73 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 1.02 లక్షల ఎకరాల్లో రబీ వరిసాగు



కోతకు సిద్ధమైన వరి పంట

రాయవరం: రబీ వరికోతలు ప్రారంభం అవుతున్నాయి. మెజారిటీ రైతులు వరికోత యంత్రాలతోనే మాసూళ్లు చేస్తున్నారు. రైతులు మాసూళ్లు పూర్తి చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కనీస మద్దతు ధరకు రైతులు తమ ధాన్యం అమ్ముకునేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. దిగుబడి అంచనా ఆధారంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

3.73 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలల్లో 1.02 లక్షల ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేశారు. ఎకరాకు 40-45 బస్తాల దిగుబడి వస్తుందన్నది వ్యవసాయ శాఖ అంచనా. ఆ ప్రకారం క్లస్టర్ పరిధిలో మూడు లక్షల 73 వేల 436 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. దిగుబడి మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసింది. క్లస్టర్ పరిధిలోని 129 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖల సమన్వయంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ మద్దతు ధర ఇలా..

ప్రభుత్వం సాధారణ రకం ధాన్యం ధర 75 కేజీల బస్తాకు రూ.1,530, ఏ గ్రేడు రకం ధాన్యం 75 కేజీల బస్తాకు రూ.1,545 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది.

మండలం	ఆర్‌బీకేలు	వరి ఎకరాల్లో	దిగుబడి అంచనా(మె.ట)
రాయవరం	19	14509	54411
మండపేట	24	16296	61111
కపిలేశ్వరపురం	19	15758	59835
ఆర్‌సీపురం	21	18120	68855
కె.గంగవరం	23	15444	57914
కాజులూరు	23	19456	71250
మొత్తం	129	99583	373436

మట్టి, రాళ్లు, ఇసుక వంటి వ్యర్థాలు ఒక శాతం మించి ఉండకూడదు. గడ్డి, చెత్త, తప్ప, కలుపు విత్తనాలు ఒక శాతం మించి ఉండరాదు. చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యపు గింజలు ఐదు శాతం మించకూడదు. పరిపక్వం కాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు మూడు శాతం లోపే ఉండాలి. తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు ఏ గ్రేడు రకంలో ఆరు శాతం మించకూడదు. తేమ లేక నిమ్ము 17 శాతానికి మించకూడదు.

రైతులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యంతో కలపరాదు. పంట కోసిన తర్వాత ఆరబెట్టక పోతే గింజలు రంగుమారి నాణ్యత కోల్పోతాయి. పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి. నూర్చేటపుడు ధాన్యంలో రాళ్లు, మట్టి గడ్డలు కలవకుండా నేలమీద బరకాలు, టార్పాలిన్లు వేసి వాటిపై నూర్పిడి చేయాలి. పంటలో తాలు, తప్ప, పొల్లు, చెత్తాచెదారం పోయేలా ఎగరబోయాలి. ధాన్యం ముక్కిపోయి, రంగుమారి నాణ్యత పడిపోకుండా తేమ తగ్గిన తర్వాతే బస్తాల్లో పట్టుబడి చేసి, లాటు కట్టాలి. నిల్వచేసే ధాన్యం బస్తాల్ని నేలపై కాకుండా చెక్కబల్లలపై నెట్టుకట్టాలి. తగిన జాగ్రత్తలు పాటించకపోతే మద్దతు కోల్పోయే అవకాశముంది.

రైతుకు మద్దతు ధర



రైతుకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతులు నష్ట పోకుండా ప్రతి ధాన్యం గింజా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– కేజే ప్రకాష్‌బాబు, తహసీల్దారు, రాయవరం

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు కనీస మద్దతు ధరపైన, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకే స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం మండలం

పీహెచ్‌సీలో తుప్పల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

కాజులూరు: గొల్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో పెరిగిపోయిన తుప్పలు, పిచ్చిమొక్కలను ఉపాధి హామీ కూలీలు శనివారం తొలగించారు. మండలంలో వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గొల్లపాలెం పీహెచ్‌సీకి వచ్చారు. కార్యక్రమం అనంతరం పీహెచ్‌సీని, పరిసరాలను పరిశీలించన ఆయన పిచ్చిమొక్కలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంటనే తుప్పలు తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఇందిరాదేవిని ఆదేవించారు. దీంతో శనివారం ఉపాధి హామీ కూలీలు తుప్పలు తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి లబ్ధిదారులను కోరారు. అచ్యుతాపురం సచివాలయంలో శనివారం హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్‌మూర్తి, సచివాలయ అసిస్టెంట్ తులసిలతో కలిసి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ పలివెల మధు, వైఎస్సార్ సీపీ నాయకులు అమ్మన్న మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇంటిని సమకూర్చాలన్న తపనతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాన్ని సమకూర్చారన్నారు. హౌసింగ్ ఏఈ మూర్తి మాట్లాడుతూ గ్రామంలో 118 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 25 మంది ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. మిగిలిన వారికి ప్రభుత్వ సాయం, నిర్మాణ ఖర్చులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

- మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి
- పట్టణం రెండో వార్డులో నాయకుల పర్యటన



మండపేటలో ప్రజాభిప్రాయం నమోదు చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



ఏరుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సమన్వయకర్త బాబూరావు



కాజులూరులో స్టిక్కర్ అందజేస్తూ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న లక్ష్మణ్, పార్టీ నాయకులు



చెల్లూరులో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నారన్నారు. పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ చిట్టూరి సతీష్, గృహసారథులతో కలిసి చైర్‌పర్సన్ దుర్గారాణి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాలనపై, గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు వ్యత్యాసంపై ప్రజాభిప్రాయాన్ని చైర్‌పర్సన్ దుర్గారాణి బుక్‌లో నమోదు చేశారు. స్థానికుల కోరిక మేరకు ఇంటి వద్ద గోడపై స్టిక్కర్లు అతికించారు. అలాగే సెల్‌ఫోన్లపై కూడా అంటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు పూర్తి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు, ప్రభుత్వ పాలనపై కచ్చితమైన ప్రజాభిప్రాయాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: నియోజకవర్గంలో రెండో రోజు శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. మూడు మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ఆర్ సీపీ చేస్తున్న మంచితో పాటుగా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతున్నారు. రామచంద్రపురం మండలం ఏరుపల్లిలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ సమన్వయ కర్త, పార్టీ నేత కంచుమర్తి బాబూరావు గృహ సారథులు కన్వీనర్‌లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి చేస్తున్న మంచిని వివరించారు. సర్పంచ్ శ్రీధర్, గ్రామ కన్వీనర్లు గోవిందు, ఆదియ్య, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తేడా గమనించండి.. విజ్ఞతతో వ్యవహరించండి

రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్కరూ గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను గమనించాలని వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ తెలిపారు. మండలంలోని చెల్లూరు శివారు కృష్ణమ్మచెరువులో సర్పంచ్ పాలిక రాఘవగోవిందు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయనతోపాటు జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు వెంటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ స్టిక్కర్లు అంటించి, సంక్షేమ పాలన ఎలా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ పలివెల ఆదిలక్ష్మి, వైట్ల వీరవేణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ మండల శాఖ కన్వీనర్ చిన్నం అపర్ణాపుల్లేష్, పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ తవిటికి రత్నకుమార్, పార్టీ నేతలు చోడె వెంకటరమణ, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నేతలు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని పండగలా నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలో పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, 19 గ్రామాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటి పర్యటించి ప్రభుత్వ పథకాలు చేస్తున్న మంచి తెలియజేశారు. ప్రజల సమ్మతిపై ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను అతికించారు.

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరికం లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పార్టీ మండలం విప్, దంగేరు ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు గృహసారథుల కమిటీ పరిశీలకునిగా నియమితులైన లక్ష్మణ్ శనివారం కాజులూరులో స్థానిక నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. గృహసారదులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి నాడు-నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టికర్లు, కరపత్రాలు పంచిపెట్టారు. గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని చిన్నారావు, సచివాలయ కన్వీనర్లు తలాటం వీరన్న, యాళ్ళ సత్తిబాబు, టేకుమూడి శ్రీనివాస్, శ్రీనివాస్, నాగేశ్వరావు ఆదినారాయణ, సూరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

చికిత్సకు రూ.40 వేల సాయం

రాజోలు: బ్లడ్ క్యాన్సర్ చికిత్స నిమిత్తం కడలి గమళ్ల పాలానికి చెందిన కేతా సాయి దిలీప్‌నకు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసమితి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. సాయాన్ని ఎంపీపీ కేతా శ్రీనివాస్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సమితి సేవలను అభినందించారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన వారంతా స్వగ్రామాల్లోని నిరుపేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. శెట్టిబలిజ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈఓ, ఎంఈఏ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కొత్తపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీఎం కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ), మెడికల్ ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ (ఎంఈఏ) కోర్సుల ఉపాధి శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, డీఎస్‌డీఓ లోకమన్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారై ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, విద్యార్హత, 3 పాస్‌పోర్ట్ ఫొటోస్‌తో సోమవారం కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలివీ..



కాజులూరులో వరి పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

కాజులూరు: రోజురోజుకు రసాయనిక ఎరువుల వాడకం అధికమవుతోంది. తెగుళ్ల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పురుగు మందులు, రసాయనిక ఎరువులు ఎక్కువ వినియోగిస్తున్నారు. అయితే పంటలపై అవసరాన్ని మించి ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల ఖర్చులు ఎక్కువై నికర ఆదాయం తగ్గిపోవటమే కాకుండా మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో విష ప్రభావానికి లోనై అనారోగ్యం పాలవుతున్నారు. మందుల పిచికారీ సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటిస్తే అధిక వ్యయాలకు గురి కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- రైతులు తెగుళ్ల లక్షణాలను పూర్తిగా గమనించి దానికి అనుగుణంగా అధికారులు సూచనల మేరకు పురుగు మందులను ఎంచుకోవాలి. మందులు కొనుగోలు చెసే సమయంలో బిల్లు రసీదులను కచ్చితంగా తీసుకోవాలి.
- మందు డబ్బా, బ్యాగులపై తయారీ తేదీ, ఎక్స్‌పైయరీ తేదీలను గమనించాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కొన్ని రకాల మందులు కళ్లలో పడితే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.
- మందులు పిచికారీ సమయంలో మద్యం సేవించడం, చుట్టా బీడీ, సిగరెట్ వంటివి తాగడం చేయకూడదు.
- మధ్యాహ్నం సమయంలో ఎండ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయకూడదు.
- మందులు పిచికారీ చేసే సమయంలో వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- గాలి వాటానికి ఎదురెల్లుతూ పొలంలో మందులు చల్లకూడదు
- పురుగు మందులు పిచికారీ చేసిన తరువాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంచేసుకోవాలి.
- మందు వినియోగించిన తర్వాత డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యితీసి పాతిపెట్టాలి. లేదా నిప్పుపెట్టి కాల్చివేయాలి.
- మందులు పిచికారీ చేస్తునప్పుడు లేదా తర్వాత విష ప్రభావానికి లోనై వాంతు చేసుకున్నా, కళ్లు తిరుగుతున్నా, చర్మం దురద పెడుతున్నా వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

అందరితో ప్రేమగా మెలగాలి



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి, డేనియల్‌పాల్ తదితరులు

మండపేట: అందరిపై ప్రేమతో ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆకాంక్షించారు. ఈస్టర్ పండగను పురస్కరించుకుని పాస్టర్ల ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డేనియల్‌పాల్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ శనివారం మండపేటలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. స్థానిక పెదకాలువ వద్ద గల బేతస్థ ప్రార్థన మందిరం వద్ద నుంచి కలువపువ్వు సెంటర్ వరకూ సాగిన ర్యాలీలో నియోజకవర్గంలోని చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ మణికుమార్, ఎంఆర్‌పీఎస్ నేత దూళి జయరాజు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏసుక్రీస్తు చిత్రం

కపిలేశ్వరపురం: నల్లూరుకు చెందిన డిప్లమో ఫైన్ ఆర్ట్స్ సెకెండ్ ఇయర్ విద్యార్థి గుత్తుల జీవన్‌కుమార్ ఈస్టర్‌ను పురస్కరించుకుని చార్కోల్ పెన్సిల్‌తో ఏసుక్రీస్తు చిత్రాన్ని గీచాడు. ఈ చిత్రం అందరినీ ఆకర్షించింది. ఆయన మండపేటలో శ్రీసత్యా డ్రాయింగ్ అకాడమీలో చదువుతున్నాడు.



గుత్తుల జీవన్‌కుమార్



పెన్సిల్‌తో వేసిన జీసస్ చిత్రం

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

మామిడికుదురు: తాళం వేసి ఉన్న ఇంటి వెనుక వైపు తలుపులు బద్దలు గొట్టి దొంగతనానికి పాల్పడిన సంఘటన కరవాక గ్రామంలో జరిగింది. దీనిపై బాధితుడు మన్నే శ్రీనివాసరావు శనివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. శ్రీనివాసరావు పంచాయతీ పక్కన ఉన్న తన ఇంట్లో కిరాణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడని ఎస్సై చెప్పారు. శ్రీనివాసరావు భార్య అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబ సభ్యులంతా రెండు నెలల నుంచి గొల్లపాలెంలోని తన సోదరుడి ఇంట్లో ఉంటున్నారన్నారు. అతని కుటుంబ సభ్యులు ప్రతి రోజు ఇంటికి వచ్చి కిరాణా సరుకులు అమ్ముకుని వెళ్తుంటారన్నారు. రోజూ లాగే ఇంటికి వచ్చే సరికి వెనుక తలుపులు బద్దలు గొట్టి ఉండడం చూసి ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు. ఇంట్లోని బీరువా తాళాలు బద్దలు గొట్టి అందులోని కొంత నగదు, బంగారం, వెండి తీసుకుపోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వెలగాలమ్మ జాతర

కపిలేశ్వరపురం: టేకి గ్రామ దేవత వెలగాలమ్మ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో జాతర సందడిగా సాగింది. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ ఉమ్మడిశెట్టి వీరవేణి, గ్రామ ప్రముఖులు తదిరతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లంక బ్రిడ్జి పనులు సత్వరమే ప్రారంభిస్తాం

అంబాజీపేట: పి.గన్నవరం మండలంలోని వరద ప్రభావిత లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ ఊడిమూడిలో నిర్మించే బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో లంకవాసులతో శనివారం సమావేశం నిర్వహించారు. గత ఏడాది జూలైలో వచ్చిన వరదలకు ముంపునకు గురైన లంక గ్రామాల్లో పర్యటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ప్రజల కోరిక మేరకు బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. హామీ అమలులో భాగంగా రూ.49.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బ్రిడ్జిని ఎక్కడ నిర్మించాలనే దానిపై ఊడిమూడి, గంటి పెదపూడి వాసుల అనుమానాలను నివృత్తి చేసేందుకు రెండు గ్రామాల ప్రజలతో చర్చించామన్నారు. అరిగెలవారిపాలెం, గంటి పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక గ్రామాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే ఉచ్చులవారిపేట, చింతావారిపేటకు మధ్యలో కాలువపై చిన్న బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లంకగ్రామాల ప్రజలతో చర్చించి బ్రిడ్జి నిర్మాణ భూమిపూజకు తేదీని ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు మంతెన రవిరాజు, అంబాజీపేట, పి.గన్నవరం పార్టీ మండలశాఖ అధ్యక్షులు వాసంశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.